సాక్షి
పశ్చిమగోదావరి

గురువారం । 30 । జనవరి । 2025



పాలీకల్చర్ నిషేధం.. రైతు కలవరం

ఆక్వా రైతులకు పాలీకల్చర్ నిషేధం గోరు చుట్టుపై రోకలిపోటులా మారింది. ప్రభుత్వ నిర్ణయంతో నష్టపోతామని ఆందోళన చెందుతున్నారు. 8లో ▸



పట్టిసం ఉత్సవాలకు ఏర్పాట్లు

పట్టిసం మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లపై పట్టిసం రేవులో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులు సూచించారు. 8లో ▸



కుక్కునూరులో అస్థిపంజరం లభ్యం

కుక్కునూరులో బుధవారం మనిషి అస్థిపంజరం లభ్యమైంది. మృతుడు తెలంగాణలోని చర్ల ప్రాంతానికి చెందిన అయితా రమేష్‌గా పోలీసులు గుర్తించారు. 8లో ▸

రిజిస్ట్రేషన్ బాదుడు షురూ

- ఫిబ్రవరి 1 నుంచి భూముల ధరలకు రెక్కలు
- అర్బన్, రూరల్ ఏరియాల్లో 10 నుంచి 40 శాతం వరకు పెంపు
- ఇప్పటికే పడకేసిన రియల్ ఎస్టేట్ రంగం
- తాజా పెంపుతో పతనమేనంటున్న వ్యాపార వర్గాలు



భీమవరంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

సాక్షి, భీమవరం: పెనుగొండ మండలం చెరుకువాడలో ఎకరం పొలం ప్రస్తుతం రిజిస్ట్రేషన్ విలువ 29 లక్షలు కాగా క్రయ విక్రయాల సమయంలో రిజిస్ట్రేషన్ ఖర్చుల కింద ప్రభుత్వానికి రూ. 2,17,500 చార్జీలు చెల్లిస్తున్నారు. ఫిబ్రవరి నుంచి భూముల విలువ పెంచడంతో ఎకరం విలువ రూ.36 లక్షలకు పెరగనుంది. ఇకపై రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే రూ.2.70 లక్షలు చెల్లించాలి. ఈ మేరకు కక్షిదారులపై అదనంగా రూ.52,500 భారం పడనుంది.

భీమవరం వన్‌టౌన్‌లోని మారుమూల గజం రూ.12,500 చొప్పున సెంటు స్థలం ప్రభుత్వ ధర రూ. 6.05 లక్షల వరకు ఉంది. ఫిబ్రవరి 1 నుంచి పట్టణంలోని అన్ని కేటగిరీ భూముల విలువను 10 శాతం పెంచడంతో గజం రూ. 13,750 చొప్పున సెంటు స్థలం రూ.6.66 లక్షలకు పెరగనుంది. ప్రస్తుతం సెంటు స్థలం రిజిస్ట్రేషన్‌కు చార్జీల కింద ప్రభుత్వానికి రూ. 45,375 చెల్లిస్తుండగా ఫిబ్రవరి నుంచి ఈ మొత్తం రూ. 49,912కు పెరగనుంది. రెండు మూడు సెంట్లు కొనుగోలు చేసుకునే సామాన్య, మధ్యతరగతి ప్రజలపై రూ.9000 నుంచి రూ. 14000 వరకు అదనపు భారం పడనుంది. పట్టణంలో పలుచోట సెంటు భూమి రూ.28.51 లక్షల నుంచి రూ.31.68 లక్షలకు పెరగనుండగా ఆ మేరకు రిజిస్ట్రేషన్ చార్జీలు పెరుగుతాయి.

నెలకు 70 వేల రిజిస్ట్రేషన్లు

ఇప్పటికే విద్యుత్ చార్జీలు పెంచి సామాన్యులపై భారం మోపిన కూటమి ప్రభుత్వం ఫిబ్రవరి 1 నుంచి భూముల విలువ పెంచుతూ మరో బాదుడుకు సిద్ధమైంది. పట్టణ, మండల కేంద్రాల శివార్లలోని వెంచర్లు, రోడ్డు పక్క స్థలాలు లక్ష్యంగా అర్బన్, రూరల్ ఏరియాల్లో రిజిస్ట్రేషన్ విలువ 10 నుంచి 40 శాతం వరకు పెంచుతూ ఆదేశాలిచ్చింది. ఈ మేరకు భూముల విలువలు భారీగా పెరగనున్నాయి. జిల్లాలో 15 సబ్‌రిజిస్ట్రార్ కార్యాయాలు ఉండగా నెలకు 70 వేల వరకు రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి సుమారు రూ.300 కోట్ల వరకు ఆదాయం సమకూరుతుంది. రిజిస్ట్రార్ విలువ ఆధారంగా రిజిస్ట్రేషన్ చార్జీలను నిర్ణయిస్తారు. ఆస్తుల క్రయ విక్రయాల రిజిస్ట్రేషన్లపై స్టాంపు డ్యూటీ, చార్జీల నిమిత్తం 7.5 శాతం, సెటిల్‌మెంట్, గిఫ్ట్ రిజిస్ట్రేషన్లయితే 2.5 శాతం, పార్టేషన్ రిజిస్ట్రేషన్ అయితే ఒక శాతం, మార్ట్‌గేజ్ రిజిస్ట్రేషన్ అయితే లోన్‌పై 0.6 శాతం వరకు ప్రభుత్వానికి చెల్లించాలి.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో భూమి విలువ పెంపు శాతం

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం	అర్బన్ ఏరియా (శాతం)	రూరల్ ఏరియా (శాతం)
తాడేపల్లిగూడెం	10–20	10–20
అత్తిలి	5–35	5–35
ఆచంట	10–20	10–30
ఆకివీడు	10–35	15–35
భీమవరం	10	10
మొగల్తూరు	11–25	10–40
నర్సాపురం	10	20
పాలకొల్లు	5–35	5–35
పెనుగొండ	20–30	20–30
పెంటపాడు	11–33	8–33
తణుకు	4–25	4–25
ఉండి	11–20	11–36
వీరవాసరం	10–25	5–33
గునుపూడి	5–25	10–30
సజ్జాపురం	7–20	9–39

భారీగా పెరగనున్న చార్జీలు

సవరించిన ధరలు శనివారం నుంచి అమల్లోకి రానున్నాయి. జిల్లాలోని అర్బన్ ఏరియాల్లో 35 శాతం, రూరల్‌లో 40 శాతం వరకు భూముల విలువలు పెరుగుతున్నాయి. అధిక శాతం పట్టణ ప్రాంతాల్లో 20 శాతానికి పైగా, అధిక శాతం మండలాల్లో 30 శాతానికి పైగా పెరిగాయి. ఈ మేరకు రిజిస్ట్రేషన్ చార్జీలు భారీగా పెరుగుతాయని వివిధ వర్గాలు అంటున్నారు. తాజా పెంపుతో భీమవరం, తాడేపల్లిగూడెం తదితర కొన్ని పట్టణ ప్రాంతాల్లో మార్కెట్ విలువ కంటే ప్రభుత్వ ధర ఎక్కువగా ఉన్నట్టు చెబుతున్నారు.

'రియల్'గా పతనమే

దాదాపు ఏడాదికాలంగా సరిగా అమ్మకాలు లేక రియల్ ఎస్టేట్ రంగం నిరాశజనకంగా ఉంది. సైట్లు అమ్ముడుపోక అప్పులు చేసి వెంచర్లు వేసిన వారి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. బిడ్డల చదువులు, వివాహాలు, ఇతర అవసరాల నిమిత్తం ఉన్న కాస్త ఆస్తిని అమ్మకానికి పెట్టినా కొనే వారు లేక సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో నెలకు ఒక్క ప్లాటు అయినా విక్రయించే వారు గత కొన్ని నెలలుగా ఒక్క ప్లాటు కూడా విక్రయించలేని పరిస్థితి ఉంది. ఇప్పుడే అంతంత మాత్రంగా ఉంటే రిజిస్ట్రేషన్ చార్జీల పెంపుతో పరిస్థితి మరింత దిగజారిపోతుందన్న ఆందోళనలో ఆయా వర్గాల వారు ఉన్నారు. పెంచిన చార్జీలు తగ్గించాలని కోరుతూ భీమవరం చాంబర్ ఆఫ్ కామర్స్ నాయకులు ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులకు వినతిపత్రం అందజేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు 3న నోటిఫికేషన్



మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.వెట్రిసెల్వి కోరారు. బుధవారం కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కేంద్ర ఎన్నికల సంఘం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. షెడ్యూల్ ప్రకారం ఎన్నికలకు ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ జారీ చేస్తారన్నారు. ఫిబ్రవరి 10 వరకు నామినేషన్ల స్వీకరణ, ఫిబ్రవరి 11న నామినేషన్ల పరిశీలన, ఫిబ్రవరి 13న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. ఫిబ్రవరి 27న ఉదయం 8.00 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుందని, మార్చి 3న కౌంటింగ్ ఉంటుందన్నారు. మార్చి 8 నాటికి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని వెల్లడించారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో పట్టభద్రుల నియోజకవర్గంలో అల్లూరి సీతారామ రాజు, కాకినాడ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 440 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉంటుందన్నారు.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్



భీమవరం డీఎన్నార్ కళాశాలలో జేఈఈ మెయిన్స్ పరీక్షకు హాజరైన విద్యార్థులు

భీమవరం/తాడేపల్లిగూడెం: భీమవరం డీఎన్నార్ కళాశాలలో బుధవారం నిర్వహించిన జేఈఈ మెయిన్స్ సెషన్–1 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం, మధ్యాహ్నం నూరు శాతం హాజరు నమోదైంది. వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం జరిగిన పరీక్షకు 222 మంది హాజరుకావాల్సి ఉండగా, ఇద్దరు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు 219 మందికి 219 మంది హాజరయ్యారు.

టీచర్ల వివరాలు నమోదు చేసుకోవాలి

భీమవరం: జిల్లాలోని ఉపాధ్యాయులంతా టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం డేటాలో వివరాలు అప్‌లోడ్ చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఇ.నారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో తప్పుగా నమోదు చేసుకున్న వివరాలను ఎడిట్ ఆప్షన్ ద్వారా సరిచేసుకోవాలని సూచించారు.

సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్ష



ఏర్పాట్లపై చర్చిస్తున్న కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే పితాని, ఎస్పీ నయీం అస్మీ

పెనుగొండ: పెనుగొండలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనపై ఏర్పాట్లపై కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, ఎస్పీ నయీంలు సమీక్షించారు. వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా చంద్రబాబు ఈ నెల 31న పెనుగొండలోని మూలవిరాట్ వాసవీ మాతను, శాంతి ధాంలోని వాసవీ మాతను సందర్శించి పూజలు చేస్తారు. ఏఎంసీలోని హెలీప్యాడ్‌ను పరిశీలించి సూచనలు చేశారు. తొలుత సందర్శించే శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యక పరమేశ్వరి ఆలయం, నిత్యాన్నదాన సత్రం, హోమ నిర్వహణా ప్రాంతం, గోశాల, శాంతి ధాంలోని రుషీగోత్ర మందిరాన్ని పరిశీలించారు.

బ్రిడ్జ్ కోర్సులో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఉండి: బ్రిడ్జ్ కోర్సులో 2025 విద్యాసంవత్సరానికి రాష్ట్రంలో రెండేళ్ల డిప్లమో కోర్సులో నేరుగా ప్రవేశం కోసం 2 ఏళ్ళ ఐటీఐ కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌బీటీఈటీ నిర్వహించే ప్రవేశ పరీక్ష కోసం రెండేళకల ఐటీఐ కోర్సు 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులు కావాలని తెలిపారు. బ్రిడ్జ్ కోర్సు పరీక్ష కోసం ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్ సబ్జెక్టుల్లో పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. దీని కోసం ఈ నెల 27 నుంచి వచ్చే నెల 21 వరకు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. పూర్తి వివరాల కోసం ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐలో సంప్రదించాలని తెలిపారు.

ప్యాకేజీ తాత్కాలిక ఉపశమనమే



పాలకొల్లులో మాట్లాడుతున్న స్టీల్ ప్లాంట్ రక్షణ సమితి నేతలు

పాలకొల్లు అర్బన్: విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీ తాత్కాలిక ఉపశమనమేనని స్టీల్ ప్లాంట్ రక్షణ సమితి నేతలు రామస్వామి, గుర్రప్ప, మహేష్ అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణ జాత బుధవారం పాలకొల్లుకు చేరింది. దీనిలో భాగంగా గాంధీ బొమ్మల సెంటర్‌లో నేతలు మాట్లాడారు. స్టీల్ ప్లాంట్‌కు పూర్తి రక్షణ కావాలంటే కేంద్ర ప్రభుత్వం వెంటనే సెయిల్‌లో విలీనం చేసి ప్రత్యేక గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి ప్రకటన చేయాలని కోరారు. విశాఖ ఉక్కు కార్మికులకు అండగా నిలిచిన ప్రజా సంఘాలకు కృతజ్ఞతలు తెలిపారు. తమ డిమాండ్లు సాధించే వరకు పోరాటం కొనసాగుతుందన్నారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు గోపాలన్, కవురు పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



కలెక్టరేట్‌లో ఇంటర్ పరీక్షలపై మాట్లాడుతున్న డీఆర్వో వెంకటేశ్వర్లు

భీమవరం: ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఇంటర్ ప్రాక్టికల్, పబ్లిక్ పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షలో ఆయన మాట్లాడారు. పరీక్షల్లో భాగంగా ఫిబ్రవరి 1న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యుయేషన్ ఎడ్యుకేషనల్ పరీక్ష, ఫిబ్రవరి 3న ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష, ఫిబ్రవరి 5 నుంచి 20 వరకు ప్రాక్టికల్ ఎగ్జామ్స్, జనరల్ ఒకేషనల్ కోర్సుల పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రధాన పరీక్షలు మార్చి 1 నుంచి మార్చి 20 వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలుంటాయన్నారు. ఇంటర్ మొదటి ఏడాది 19,775 మంది, రెండో ఏడాది 18,128 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 52 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తుండగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

విద్యుత్ సంస్థ శకటానికి ప్రశంసలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఈ నెల 26న రిపబ్లిక్ డే సందర్భంగా ఏలూరు పెరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన శకటాల పోటీలో విద్యుత్ సంస్థ శకటం ద్వితీయ స్థానంలో నిలవడంతో ప్రశంసలు లభించాయి. ఈ సందర్భంగా ఎనర్జీ డిపార్ట్‌మెంట్ నుంచి, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఏలూరు విద్యుత్ శాఖ శకటానికి ప్రత్యేక ప్రశంసలు అందాయని ఈపీడీసీఎల్ ఏలూరు సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ పీ.సాల్మన్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ విద్యుత్ ఉద్యోగ సంఘాల నాయకులు, అధికారులకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఏలూరు ఈఈ టెక్నికల్ పీ రాధాకృష్ణ, డీఈఈలు బీవీ కృష్ణరాజా, టీ రాజ్ కుమార్, ఏ రమాదేవి పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి వంట ఏజెన్సీల సమస్యలు



పాలకొల్లు మున్సిపల్ హైస్కూల్‌లో భోజనం చేస్తున్న ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి

పాలకొల్లు అర్బన్: పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండిపెడుతున్న వంట ఏజెన్సీల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి హామీ ఇచ్చారు. పాలకొల్లు పట్టణంలోని బ్రాడీపేట ఏవీఎస్ఎస్ మున్సిపల్ హైస్కూల్‌లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాల పారిశుధ్య జిల్లా కోఆర్డినేటర్ కె.కృష్ణారావు ఎమ్మెల్సీ గోపిమూర్తితో కలిసి పాఠశాలలో ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం నాణ్యత, చిక్కీలు, బియ్యం నిల్వల రికార్డులు పరిశీలించారు. 327 మంది విద్యార్థులకు 303 మంది విద్యార్థులు పాఠశాలకు హాజరు కాగా వీరిలో 260 మంది మాత్రమే మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం చేయని 43 మందికి ప్రత్యేకంగా కౌన్సిలింగ్ ఇచ్చారు.

1 నుంచి వంతులవారీ విధానం

భీమవరం: పశ్చిమ డెల్టాలో వరి సాగుకు ఫిబ్రవరి 1 నుంచి వంతుల వారీ విధానం అమలు చేయనున్నారు. గోదావరిలో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున పశ్చిమ డెల్టా 11 ప్రధాన కాలువలకు వంతుల వారీ విధానం అమలు చేయనున్నట్లు నరసాపురం ఇరిగేషన్ సబ్ డివిజన్ ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ సీహెచ్ వెంకటనారాయణ బుధవారం తెలిపారు. ఈ విధానం రెండు వంతులుగా ఉంటుందని మొదటి వంతు ఆరు రోజులు, రెండో వంతు ఆరు రోజులుగా అమలు చేస్తారన్నారు.

ఫీజుల చెల్లింపునకు గడువు పెంపు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఎల్ఈడీ) 2023–25 బ్యాచ్ 3వ సెమిస్టర్, అనుత్తీర్ణులైన అభ్యర్థులకు పరీక్ష ఫీజు చెల్లించడానికి గడువు తేదీ పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ తెలిపారు. అపరాధ రుసుం లేకుండా ఈ నెల 31 వరకూ ఫీజు చెల్లించవచ్చని, రూ.50 అపరాధ రుసుంతో ఫిబ్రవరి 4 వరకూ ఫీజు చెల్లించవచ్చన్నారు.

కూటమి కక్ష సాధింపు



తంగెళ్లమూడిలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిరంజీవులు ఇంటి ముందు షాపులు కూల్చివేస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నాయకులను లక్ష్యంగా చేసుకుని కక్ష సాధింపు చర్యలకు దిగుతోంది. ఏలూరు నగరంలోని తంగెళ్లమూడి ప్రాంతంలో ఆక్రమణల తొలగింపు పేరుతో ఏలూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు నెర్సు చిరంజీవులుకు సంబంధించిన షాపులను బుధవారం నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు దగ్గర ఉండి కూల్చివేయించారు. నగరంలో గుర్తించిన ఆక్రమణలను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టామని, ఇందులో ఎలాంటి రాజకీయం లేదంటూ అధికారులు చెబుతున్నారు. అయితే స్థానిక ప్రజా ప్రతినిధుల ప్రోద్బలంతోనే నగరపాలక సంస్థ అధికారులు తమపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఆక్రమణల తొలగింపు పేరుతో తంగెళ్లమూడి వంతెన ఎదురుగా ఉన్న ప్రాంతం నుంచి దిగువ రోడ్డు వైపు ఒకటి రెండు చోట్ల ఇంటి ముందు ఉన్న షెడ్లను తొలగించారు. తొలగించిన ఒకటి, రెండు ఆక్రమణలలో నెరుసు చిరంజీవులకు చెందిన షాపులు ఉన్నాయి.

తీరంలో భూములపై కుట్ర

- పేదలకు ఇచ్చిన పట్టా భూములపై కూటమి నేతల కన్ను
- వేములదీవిలో భూముల దోపిడీకి యత్నం
- డంపింగ్ యార్డ్ స్థలం మాయమంటూ నాటకాలు



వేములదీవిలో కూటమి నేతలు కన్నేసిన పేదలకు ఇళ్ల పట్టాలుగా ఇచ్చిన భూమి

నరసాపురం: అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అందినకాడికి దండుకోవడమే పనిగా పెట్టుకున్న నరసాపురం కూటమి నేతలు తీరంలో నిరుపేదల భూములపై కన్నేశారు. నిరుపేదలకు ఇల్లు కట్టుకోవడానికి నవరత్నాల పథకంలో గత ప్రభుత్వం నరసాపురం మండలం వేములదీవి గ్రామంలో 2 ఎకరాల ప్రభుత్వ భూమిని ఇళ్ల పట్టాలుగా పంపిణీ చేసింది. గతంలో అక్కడే మున్సిపల్ డంపింగ్ యార్డ్ ఏర్పాటు కోసం స్థలం కేటాయించాలని తీసుకున్న నిర్ణయాన్ని అడ్డుగా పెట్టుకుని పేదలకు పట్టాలుగా ఇచ్చిన 2 ఎకరాల భూమితో పాటు మరో 25 ఎకరాలు కాసేసే కుట్రకు కూటమి నేతలు బరితెగించారు. దీనికి పక్కా వ్యూహంతో ముందుగా తమ అనుకూల మీడియా ద్వారా మున్సిపల్ డంపింగ్ యార్డు స్థలం మాయమైందంటూ ప్రచారంలో చేయించి.. దాని మాటున ఇప్పటికే దొంగ పట్టాలు సృష్టించి ఎకరాలు కాజేయాలని పథకం రచించారు.

ఇదీ వేములదీవి భూమి వ్యవహారం

2104లో నరసాపురం మున్సిపాలిటీ డంపింగ్‌యార్డ్ కోసం పట్టణానికి దూరంగా వేములదీవిలో 228/2 సర్వే నెంబర్‌లో 5 ఎకరాల స్థలాన్ని చూశారు. ఎకరం రూ.2.25 లక్షల చొప్పుల 5 ఎకరాలకు రూ.26.25 లక్షలు మున్సిపాలిటీ డిపాజిట్ చేసింది. అప్పట్లో రెవెన్యూ శాఖ వేములదీవిలో సదురు స్థలాన్ని కేటాయిస్తామని మున్సిపాలిటీకీ తెలిపినా.. ఇదే స్థలమంటూ రికార్డు చూపలేదు. తరువాత ఆ ప్రాంతంలో డంపింగ్‌యార్డ్ వద్దంటూ స్థానికులు ఆందోళన చేయడంతో మున్సిపాలిటీ ప్రయత్నాన్ని విరమించుకుంది.

ఇళ్ల స్థలాల కోసం ఇచ్చిన వైఎస్సార్‌సీపీ సర్కార్

228/2 సర్వే నెంబర్‌లో మొత్తం 11 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంటే అందులో 2 ఎకరాల భూమిని 2021లో నవరత్నాలు, పేదలకు ఇళ్ల పథకంలో ఇళ్ల పట్టాలుగా పంపిణీ చేశారు. పేదలకు పంపిణీ చేసిన భూమితో పాటు పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిపై కన్నేసిన కూటమి నేతలు కొన్ని రోజులుగా మున్సిపాలిటీ సొమ్ము చెల్లించి కొన్న డంపింగ్‌యార్డ్ స్థలం మాయమైందంటూ ప్రచారం చేయించడం మొదలు పెట్టారు. ప్రభుత్వం మారిన తరువాత మున్సిపాలిటీలో పుట్టుకొచ్చిన కొందరు అనధికార వలస కౌన్సిలర్ల సాయంతో ఎకరాల భూములు కాజేయాలని పన్నాగం పన్నుతున్నారనే విమర్శలు వస్తున్నాయి.

మున్సిపాలిటీకి ఇస్తామన్న భూమితో సంబంధం లేదు

వేములదీవిలో మున్సిపాలిటీకి కేటాయిస్తామని చెప్పిన స్థలంలో పేదలకు ఇచ్చిన 2 ఎకరాల స్థలంలేదు. మున్సిపల్ స్థలం పేదలకు పంచారనే అంశంలో వాస్తవం లేదు. 2011లో అప్పుటి ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు ఆ సర్వే నెంబరులోని స్థలంలో సోషల్ వెల్ఫేర్ బిల్డిగ్ నిర్మించడానికి ప్రభుత్వానికి ప్రతిపాదించారు. 2020లో నరసాపురానికి మంజూరైన ఆక్వా యూనివర్సిటీ నిర్మాణానికి కూడా అక్కడ ప్రతిపాదించారు. ఆ తర్వాత మున్సిపల్ డంపింగ్ యార్డ్ కోసం ఈ ప్రాంతంలో 5 ఎకరాలు కేటాయించాలనే ఆలోచన ఉందని అధికారుల ద్వారా తెలుసుకున్న అప్పటి ఎమ్మెల్యే ముదునూరి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూమిని మరో ప్రభుత్వ శాఖ అవసరం కోసం సొమ్ములు చెల్లించి కొనడాన్ని వ్యతిరేకించారు. డంపింగ్ యార్డ్‌కు మరో స్థలం అన్వేషణ చేయాలని, అక్కడున్న సర్వే నెంబరులో ఉన్న 2 ఎకరాలను పేదలకు ఇళ్ల పట్టాలుగా పంపిణీ చేయించారు.

సొమ్ములు చెల్లించాం

మున్సిపాలిటీకి డంపింగ్‌యార్డ్ కోసం రూ 26.25 లక్షలు రెవెన్యూ శాఖకు చెల్లించిన మాట వాస్తవం. సొమ్ములు చెల్లించినట్లుగా మా వద్ద రికార్డులు న్నాయి. మున్సిపాలిటీకి వేములదీవి స్థలం కాగితాల మీద మాత్రమే చూపించారు. పట్టాలు ఇచ్చిన భూమి, మున్సిపాలిటీ ఇచ్చామన్న భూమి రెండూ ఒకటేనా అన్నది పూర్తిగా తెలియదు. రెవెన్యూ శాఖను సంప్రదించి వివరణ తీసుకుంటాం.

– ఎస్ఎస్‌వీ త్రినాథరావు, పట్టణ ప్రణాళికా అధికారి, నరసాపురం

ఇదీ అసలు దోపిడీ తంత్రం

ఈ భూములపై కన్నేసిన కూటమి నేతలు ఇళ్ల స్థలాలకు ఇచ్చిన భూమితో పాటు మిగులు భూములకు ఎప్పుడో పట్టాలు ఇచ్చేసినట్టుగా దొంగ పట్టాలు సృషించారని తెలుస్తోంది. ప్రభుత్వానికి చెందిన మున్సిపల్ డంపింగ్ యార్డ్ స్థలం అడ్డంపెట్టుకుని మొత్తం కాజేయడానికి పెద్ద స్కెచ్ వేశారు. వైఎస్సార్‌సీపీ హయంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం పాపం అన్నట్టు, మున్సిపల్ డంపింగ్ యార్డ్ స్థలం మాయం అంటూ చేస్తున్న ప్రచారంపై వైఎస్సార్‌సీపీ నేతలు ఆగ్రహంగా ఉన్నారు. కోర్టును ఆశ్రయించడానికి సిద్ధపడుతున్నారు. ఒకవేళ అదే జరిగితే తాము ఇరకాటంలో పడతామని ఇప్పటికే ఈ వ్యవహారంలో కూటమి నేతల ఒత్తిళ్లతో నలిగిపోతున్న అధికారులు ఆందోళన చెందుతున్నారు.

క్లుప్తంగా

గోదావరిలో స్నానానికి దిగి వ్యక్తి మృతి


గోదావరిలో వెలికితీసిన నాగేందర్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పోలవరం రూరల్ : పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో గోదావరి నదిలో స్నానానికి దిగి ప్రమాదవశాత్తూ ఒక వ్యక్తి మృతిచెందాడు. మంగళవారం మహానందీశ్వర స్వామి ఆలయ సమీపంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం కృషీ నగర్‌కు చెందిన నాగేందర్ (33) స్నానానికి దిగి గల్లంతయ్యాడు. బుధవారం సాయంత్రం మృతదేహాన్ని గుర్తించారు. పోలవరం సీఐ బాల సురేష్, ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం పోలవరం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ వ్యక్తి సబ్ కాంట్రాక్టర్ వద్ద పనిచేస్తున్నట్లు తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో జైలు శిక్ష

నూజివీడు: చెల్లని చెక్కు కేసులో నూజివీడుకు చెందిన కోలవెన్ను వరలక్ష్మికి ఆరు నెలల జైలుశిక్ష, రూ.7 లక్షల జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి బుధవారం తీర్పు చెప్పారు. 2021 జూన్ 3న చలమల వెంకట రమేష్ వరలక్ష్మికి రూ.6.50 లక్షలు అప్పుగా ఇచ్చారు. కొంతకాలం తరువాత బాకీ తీర్చమని వెంకట రమేష్ అడుగగా, వరలక్ష్మి 2022 మే 1న రూ.6.50 లక్షలకు చెక్కును ఇచ్చారు. ఆ చెక్కును వెంకట రమేష్ బ్యాంకులో వేయగా వరలక్ష్మి బ్యాంకు ఖాతాలో నగదు లేదని చెక్కును తిప్పి పంపారు. దీంతో అతను కోర్టులో కేసు వేయగా విచారణ అనంతరం స్పెషల్ మేజిస్ట్రేట్ వరలక్ష్మికి జైలు శిక్ష, జరిమానా విధించారు.

ముద్దాయికి జైలు శిక్ష

భీమవరం: భీమవరం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో కిళ్లీ దుకాణంలో దొంగతనం చేసిన కేసులో ముద్దాయి యల్లమిల్లి సతీష్ కుమార్‌కు 3 నెలల 15 రోజులు జైలుశిక్ష విధిస్తూ సెకండ్ ఏజేఎఫ్ సీఎం న్యాయమూర్తి డి.ధనరాజు తీర్పు చెప్పారని పోలీసులు తెలిపారు. క్రైమ్ నెంబరు 214గా 2023లో కేసు నమోదు కాగా ఎస్సై కిరణ్ కుమార్ విచారణ చేశారు. నేరారోపణ రుజువు కావడంతో ముద్దాయికి శిక్ష ఖరారైందన్నారు. ఏపీపీ సుజాత వాదనలు వినిపించారు. కానిస్టేబుల్ మురళీ సహకరించారన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి


జల్లేపల్లి అచ్చాయమ్మ (ఫైల్)

పోలవరం రూరల్: పోలవరం పంచాయతీ పరిధిలోని నూతనగూడానికి చెందిన జల్లేపల్లి అచ్చాయమ్మ (109) శతాధిక వృద్ధురాలు బుధవారం మృతి చెందింది. అచ్చాయమ్మకు ఐదుగురు కొడుకులు, నలుగురు కుమార్తెలు సంతానం. 29 మంది మనుమలు, 78 మంది మునిమనుమలు ఉన్నారు. దాదాపు 150 మంది కుటుంబ సభ్యులకు ఆమె పెద్దదిక్కుగా ఉన్నారు. అచ్చాయమ్మ మృతిపై వైఎస్సార్‌సీపీ తూర్పుగోదావరి జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ సంతాపం తెలియజేశారు.

పాలీకల్చర్ నిషేధం.. రైతు కలవరం

- రొయ్యల సాగులో నష్టాల నివారణకు పాలీకల్చర్ సాగు
- తీర ప్రాంతంలో దీనిపైనే ఆధారం


భీమవరం ప్రాంతంలో రొయ్యల సాగు దృశ్యం

భీమవరం : ఆక్వా సాగులో అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న రైతులకు పాలీకల్చర్ నిషేధం గోరుచుట్టుపై రోకలిపోటులా మారింది. జిల్లాలో సుమారు 80 వేల ఎకరాల్లో రొయ్యలు సాగుచేస్తుండగా సముద్ర తీర ప్రాంతంలో కొంతమంది రైతులు ఒకే చెరువులో చేపలు, రొయ్యలు కలిపి సాగుచేయడం (పాలీకల్చర్) ద్వారా కొంత లాభాలు సంపాదిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులందరికీ విద్యుత్ సబ్సిడీ ఇస్తామని, రొయ్యల ధరల నిర్ణయంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, రొయ్యల సాగులో రైతులు నష్టపోకుండా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడు నెలలు గడిచిపోయినా ఆక్వా రైతులకు ఉపయోగపడే ఒక్క చర్యను చేపట్టలేదు. రొయ్యల ధరల్లో నిలకడ లేకపోవడం, రొయ్యలకు వైరస్ సోకి చనిపోవడం, ఫీడ్ ధరలు విపరీతంగా పెరిగిపోవడం వంటి సమస్యలతో రైతులు కుదేలవుతున్నారు.

నష్టాలు తగ్గించుకోవడానికి పాలీకల్చర్

రొయ్యల సాగులో నష్టాలు అధిగమించడానికి కొంతమంది రైతులు చెరువుల్లో చేప, రొయ్యలు కలిపి సాగుచేస్తున్నారు. ఎకరాకు 1,000 చేప పిల్లలు, దాదాపు లక్ష వరకు రొయ్య పిల్లలు వేసి సాగు చేయడం ద్వారా రొయ్యలు చనిపోయినా చేపల ద్వారా కొంత ఆదాయం రావడంతో పెద్ద మొత్తంలో నష్టం లేకుండా బయటపడవచ్చని రైతులు పాలీకల్చర్ పట్ల ఆసక్తి చూపిస్తున్నారు. చేపలకు వినియోగించే మేతల్లో యాంటీబయాటిక్స్ ఉండడం వల్ల అదే మేతను రొయ్యలు ఆహారంగా తింటున్నాయి. దీంతో రొయ్యల ఎగుమతుల్లో ఇబ్బందుల దృష్ట్యా పాలీకల్చర్ నిషేధించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జిల్లాలో ఫిషరీస్, డ్రగ్ ఫుడ్ సేఫ్టీ, ఎంపెడా, రెవెన్యూ, పోలీసు అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి నివేదిక ఇవ్వాలని ఇటీవల జాయింట్ కలెక్టర్ టి రాహుల్‌కుమార్ రెడ్డి ఆదేశాలిచ్చారు. దీంతో పాలీకల్చర్ చేస్తున్న రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాలీకల్చర్‌తో సాగుచేసే రొయ్యలకు స్థానికంగా మార్కెట్ కల్పించే ఏర్పాట్లు చేయకుండా పూర్తిగా నిషేధించాలని నిర్ణయం తీసుకోవడం సరైందికాదని వాపోతున్నారు.

నాణ్యమైన సీడ్ కరువు

ఫీడ్ తయారీ కంపెనీలపై ప్రభుత్వం అజమాయిషీ లేకపోవడంతో ఫీడ్ ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఫీడ్ తయారీకి ఉపయోగించే ముడి సరుకు ధరలు తగ్గినా ఫీడ్ ధరలు తగ్గకపోగా మరింత పెరుగుతున్నాయి. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా ఫీడ్ కంపెనీల యజమానులతో మాట్లాడి ధరలను కట్టడి చేశారు. ప్రస్తుతం వాటిపై ఎటువంటి నియంత్రణ లేకపోవడంతో ధరలు మరింత పెరుగుతున్నాయి. నాణ్యమైన సీడ్ లభించకపోవడంతో రొయ్యల చెరువులో సీడ్ వేసిన నెల రోజుల్లోనే వైరస్ సోకి రొయ్యలు చనిపోతున్నాయి.

స్థానిక మార్కెట్ కల్పించాలి



ఆక్వాసాగులో పాలీకల్చర్ నిషేధిస్తే రైతులు తీవ్రంగా నష్టపోతారు. సముద్ర తీర ప్రాంతంలోని భూములు ఆక్వా సాగుకు తప్ప దేనికీ ఉపయోగపడవు. అలాంటి భూముల్లో పూర్తిగా రొయ్యల సాగు చేస్తే రైతులకు నష్టాలు తప్పవు. కొంతమంది రైతులు పాలీకల్చర్ చేస్తుంటారు. ఆ విధంగా సాగుచేసిన రొయ్యలకు ప్రభుత్వం స్థానికంగా మార్కెట్ కల్పించి ప్రోత్సహించాల్సింది పోయి నిషేధిస్తే అక్కడి భూములు బీడుగా మారిపోతాయి.

– గాదిరాజు సుబ్బరాజు(జీకేఎఫ్), ఆక్వా రైతుల సంఘం కార్యదర్శి, భీమవరం

హోరాహోరీగా టెన్నిస్ పోటీలు


భీమవరం యూత్ క్లబ్‌లో టెన్నిస్ బాలికల పోటీల దృశ్యం

భీమవరం: భీమవరం యూత్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కనుమూరు సూర్యనారాయణరాజు మెమోరియల్ ఆలిండియా టెన్నిస్ అండర్–16 బాల, బాలికల టోర్నమెంట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. బాలికల పోటీలో యూత్ క్లబ్‌లోనూ, బాలుర పోటీలు కాస్మోపాలిటన్ క్లబ్‌లో నిర్వహిస్తున్నారు. బుధవారం క్వార్టర్ ఫైనల్‌లో జరిగిన పోటీల్లో విజేతల వివరాలను టోర్నమెంట్ డైరెక్టర్ జీవీకే శివరామరాజు తెలిపారు. జోషితపై సెలిన్ 6–3, 6–4 స్కోరుతో విజయం సాధించింది. జశ్వంతిపై తనుశ్రీ 6–0, 6–2 స్కోరుతో, నందినిపై సంజన 6–2, 7–6 స్కోరుతో, వసుధపై శాన్వి 6–3, 6–4 స్కోరుతో గెలుపొందింది. అదే విధంగా బాలుర విభాగంలో భవేష్‌పై పార్థివ్ 6–0, 6–0 స్కోరుతో, దైవిక్‌పై ప్రమోద్ 6–1, 6–0 తేడాతో, భువన్‌పై విక్టర్ 6–2, 6–1 స్కోరుతో, అర్మాన్‌పై విగ్నేష్ 6–3, 6–4 స్కోరుతో విజయం సాధించారు.

కుక్కునూరులో అస్థిపంజరం లభ్యం

మృతుడు తెలంగాణవాసిగా గుర్తింపు



పూర్తిగా కుళ్లిన స్థితిలో లభించిన అస్థిపంజరం, ఆత్మహత్యకు పాల్పడిన అయితా రమేష్ (ఫైల్)

కుక్కునూరు: పూర్తిగా కుళ్లిన స్థితిలో మనిషి అస్థిపంజరం బుధవారం కుక్కునూరులో లభ్యమైంది. మృతుడు తెలంగాణలోని చర్ల ప్రాంతానికి చెందిన అయితా రమేష్ (42)గా పోలీసులు గుర్తించారు. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని రైస్‌మిల్లు వెనుకాల గల జామాయిల్ తోటలో అస్థి పంజరం పడి ఉండటాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి వెళ్లి పోలీసులు పరిశీలించగా, అక్కడ దొరికిన సెల్‌ఫోన్, బట్టలు ఆధారంగా మృతుడు కుక్కునూరు గ్రామం నుంచి వలస వెళ్లి తెలంగాణలోని చర్ల ప్రాంతంలో నివసిస్తున్న అయితా రమేష్‌గా గుర్తించినట్లు చెప్పారు. వివాహితుడైన రమేష్‌కు కేన్సర్ వ్యాధి సోకడంతో కుటుంబసభ్యులు పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయిస్తున్నారన్నారు. అయినప్పటికీ వ్యాధి తగ్గకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురైన రమేష్ గత నెల 30వ తేదీన ఇంటి నుంచి బయటకు వచ్చి భద్రాచలంలోని ఓ పురుగుమందుల దుకాణంలో పురుగుమందు కొనుగోలు చేసి కుక్కునూరు వచ్చి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుడు గతంలో కుక్కునూరువాసి కావడం, అతని సెల్‌ఫోన్ సిగ్నల్ కుక్కునూరు వరకే చూపించడం, గత నెలలో చర్ల పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు కావడం, పురుగుమందుల షాపులో రమేష్ పురుగుమందు కొనుగోలు చేసిన సీసీ ఫుటేజ్ నమోదు కావడంతో మృతదేహం రమేష్‌ది అని గుర్తించారు. అంతేకాక కుటుంబసభ్యులు సెల్‌ఫోన్, బట్టలు రమేష్‌గా ధ్రువీకరించడంతో మృతదేహానికి పంచనామా పూర్తి చేసి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు వివరించారు.

పట్టిసం ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు


ఉత్సవ ఏర్పాట్లపై మాట్లాడుతున్న ఆర్డీవో, ఉత్సవ కమిటీ చైర్మన్ ఎంవీ రమణ

పోలవరం రూరల్ : పట్టిసం మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అధికార యంత్రాంగం సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని ఉత్సవ కమిటీ చైర్మన్, జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎంవీ రమణ ఆదేశించారు. ఉత్సవ ఏర్పాట్లపై పట్టిసం రేవులో మొదటి సమావేశం బుధవారం నిర్వహించారు. ఫిబ్రవరి 25 నుంచి 27 వరకు మూడు రోజుల పాటు ఇసుక తిన్నెలపై జరిగే ఈ ఉత్సవాలకు లక్ష మందికి పైగా హాజరవుతారనే అంచనాతో ఏర్పాట్లు చేయాలన్నారు. క్యూలైన్లు, విద్యుత్ అలంకరణ, చలువ పందిళ్లు తదితర ఏర్పాట్లన్నీ చేయడం జరుగుతుందని దేవదాయశాఖ ఏసీ హరి సూర్యప్రకాష్ తెలిపారు. ఉత్సవాల సమయంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. 400 మందికి పైగా పోలీసులు విధులకు హాజరవుతారన్నారు. ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు. వైద్యారోగ్యశాఖ సిబ్బందిని వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని వైద్యాధికారి మురళీకృష్ణ తెలిపారు. మద్యం అమ్మకాలు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ కె.వీరబ్రహ్మం తెలిపారు. రవాణా శాఖ అధికారి ఆర్టీవో మదని మాట్లాడుతూ ఉత్సవ సమయంలో ట్రాఫిక్ సమస్య లేకుండా నిరంతరం పరిశీలించడం జరుగుతుందన్నారు. తహసీల్దార్ ఆర్ఎస్ రాజు, ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, హుకుంపేట జమీందార్ హోతా సీతారామశాస్త్రి, సర్పంచ్ సబ్బారపు శ్రీరామమూర్తి, దేవస్థానం ఈవో చాగంటి సురేష్ నాయుడు, సీఐ బాల సురేష్, ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిదులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ మార్పు చేస్తే ప్రజా ఆందోళనే


భీమవరం సీపీఎం కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న గోపాలన్

భీమవరం: భీమవరంలో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ భవనాల నిర్మాణానికి గత ప్రభుత్వం కేటాయించిన భూములను మార్పుచేస్తే ప్రజాందోళన చేపడతామని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్వీ గోపాలన్ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో పట్టణంలోని వ్యవసాయమార్కెట్ యార్డు వద్ద అన్ని హంగులతో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ భవనాల నిర్మాణానికి 25 ఎకరాలు కేటాయించారని చెప్పారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తరువాత గత ప్రభుత్వం భూములు కేటాయిస్తూ ఇచ్చిన జీవో రద్దుచేసినట్లు విస్తృతంగా ప్రచారం జరుగుతుందని, దీనిపై కలెక్టర్ నాగరాణి, స్థానిక ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరముందని గోపాలన్ డిమాండ్ చేశారు. వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద కేటాయించిన భూముల్లో కలెక్టరేట్ ఏర్పాటుచేస్తే జిల్లాలోని 7 నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటుందని, రవాణా సౌకర్యానికి ఇబ్బందులు ఉండవన్నారు. ప్రజాభిప్రాయానికి భిన్నంగా కలెక్టరేట్ మార్పు చేస్తే అన్ని వర్గాల ప్రజల మద్దతుతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ప్రజా ఉద్యమం చేపడతామని గోపాలన్ హెచ్చరించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు బి బలరామ్, ఎం వాసుదేవరావు పాల్గొన్నారు.

కలియుగ వైకుంఠం శోభనాచలుని క్షేత్రం

- నేటినుంచి స్వామివారి కల్యాణోత్సవాలు
- 11 రోజులపాటు విశేష పూజలు



శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, స్వామివార్ల మూలవిరాట్‌లు (అంతర చిత్రం)

ఆగిరిపల్లి : రాష్ట్రంలో అత్యంత ప్రసిద్ధి చెందిన నరసింహుని ఆలయాల్లో ప్రముఖమైన ఆగిరిపల్లిలోని శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నృసింహస్వామి మాఘమాస కల్యాణ మహోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల సందర్భంగా 11 రోజులపాటు స్వామివారికి నిత్యం విశేష పూజలు నిర్వహిస్తారు. ఈ తిరునాళ్లకు జిల్లా వారే కాకుండా పక్క జిల్లాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. అలాగే ఇక్కడ జరిగే స్వామివారి దివ్య రథోత్సవంలో ఏటా లక్ష మందికి పైగా భక్తులు పాల్గొంటారు. శోభనగిరిపై స్వామివారు వ్యాఘ్ర రూపంలో వెలిశారని స్థల పురాణం చెబుతుంది. ఇక్కడ కొండపైకి 750 మెట్లు ఉండగా 150 మెట్ల వద్ద శేషయ్య పీఠం (కోదండ రామాలయం), 200 మెట్ల వద్ద వేణుగోపాలస్వామి ఆలయం, 300 మెట్ల వద్ద వేంకటాచలస్వామి ఆలయం, 600 మెట్ల వద్ద స్వయంభూ వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, 750 మెట్ల వద్ద గిరి శిఖర భాగాన దుర్గాపార్వతీ సమేత మల్లికార్జున స్వామి ఆలయాలు ఉన్నాయి.

నేటినుంచి స్వామి కల్యాణోత్సవాలు

ఆగిరిపల్లి శోభనగిరిపై వెలిసిన లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణోత్సవాలు ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 9వ తేదీ వరకు జరగనున్నాయి. మాఘ శుద్ధ పాడ్యమి గురువారం సాయంత్రం 5 గంటలకు స్వామివారిని చంద్ర ప్రభ వాహనంపై ఊరేగింపుగా కల్యాణ మండపంలోకి తీసుకువచ్చి పెళ్లి కుమారుడిగా అలంకరించి రాత్రి 8గంటలకు నిత్యకల్యాణాన్ని వేద పండితులు జరిపిస్తారు. స్వామివారి కల్యాణానికి కైంకర్య పరులుగా ఆలయ వంశపారంపర్య ధర్మకర్త యలమర్రు ఎస్టేట్ జమీందారు వంశస్థులైన మాజీ ఎమ్మెల్యే మేకావెంకట ప్రతాప్ అప్పారావు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. 31, ఫిబ్రవరి 1, 2, 3వ తేదీల్లో రాత్రి 8 గంటలకు స్వామివారికి వివిధ వాహనాలపై గ్రామోత్సవాలు నిర్వహిస్తారు. అలాగే 4వ తేదీ రాత్రి 9 గంటలకు శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నృసింహస్వామి, గోదా అమ్మవార్ల తిరు కల్యాణం, రాధాకృష్ణ కల్యాణం, ప్రభుత్వ సేవ, ఎదుర్కోలు ఉత్సవం, కొట్నాల సేవ, విశేష పుష్పాలంకరణ, ఉంజల్ సేవ నిర్వహించనున్నారు. అనంతరం 5వ తేదీ ఉదయం 7 గంటలకు గ్రామంలోని నాలుగు మండపాల చుట్టూ భక్తుల గోవింద నామస్మరణల మధ్య అంగరంగ వైభవంగా రథోత్సవం నిర్వహించనున్నారు.

అన్యాయంగా కేసు పెట్టారంటూ మహిళ ఆత్మహత్యాయత్నం


తాడేపల్లిగూడెం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కలగాని స్వాతి

తాడేపల్లిగూడెం అర్బన్ : అత్తింటి బాధలు భరించలేక పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. పోలీసులే తిరిగి తమపై కేసులు బనాయిస్తామని బెదిరిస్తున్నారంటూ ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తాడేపల్లిగూడెంలో జరిగింది. కలగాని స్వాతి తనను వరుసకు బావ అయిన కలగాని నాగశ్రీనివాసరావు, మావయ్య కలగాని ప్రభాకరరావు లైంగికంగా వేధిస్తున్నారంటూ గతంలో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. పోలీసులు కేసు నమోదు చేసి కోర్టుకు పంపారు. కేసు కోర్టులో నడుస్తుండగా అత్తింటి వారు ఇచ్చిన తప్పుడు ఫిర్యాదుతో తనతో పాటు.. ఈ కేసుతో సంబంధం లేని, ఉద్యోగాలు చేసుకుంటున్న తన కుమార్తెలను కూడా పోలీసుస్టేషన్‌కు రావాలని పోలీసులు వేధిస్తున్నారంటూ స్వాతి ఆవేదన వ్యక్తం చేస్తోంది. 2023లో తాను ఇచ్చిన ఫిర్యాదుపై అప్పటి సీఐ నాగరాజు, ఎస్సై జీజే ప్రసాద్ చర్యలు తీసుకోకపోగా.. తిరిగి తనపై కేసు నమోదు చేశారని ఆరోపించింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత సీఐ ఎ.సుబ్రహ్మణ్యం తన ఇంటికి పోలీసులను పంపించి స్టేషన్‌కు రావాలంటూ బెదిరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో నీటిలో చీమల మందు కలుపుకొని తాగింది. ప్రస్తుతం ఆమె తాడేపల్లిగూడెం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతోంది.

రంగుల కలగా రాష్ట్ర ప్రభుత్వ విజన్ 2047



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం

ఏలూరు (టూటౌన్) : కూటమి ప్రభుత్వం విజన్ 2047 ప్రణాళిక రంగుల కలగా ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదనే పేరుతో ఎన్నికలలో ఇచ్చిన హామీలు –పథకాల అమలకు తిలోదకాలు ఇచ్చేందుకు చంద్రబాబు ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక ఉద్దరాజు రామం భవనంలో సీపీఎం జిల్లా కమిటీ సమావేశం ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ రాష్ట్రంలో 1/70 చట్టం సవరణ కుట్ర చేయడం ఆదివాసుల హక్కుల హరించడమేనని ఆయన విమర్శించారు. అలాగే భైరవపట్నం అగ్నిప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు ఎక్స్ గ్రేషియో చెల్లించాలని, గాయపడిన వారికి పూర్తిస్థాయి వైద్యం ప్రభుత్వం అందించాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డీఎన్‌వీడీ ప్రసాద్, ఆర్.లింగరాజు పాల్గొన్నారు.

భారంగా పశుపోషణ


నూజివీడులో రూ.13వేలకు విక్రయిస్తున్న ట్రాక్టర్ వరిగడ్డి

నూజివీడు: వరిగడ్డి కొరత కారణంగా రైతులకు పశుపోషణ భారంగా మారింది. యంత్రాలతో వరి కోతలను కోయించడంతో వరిగడ్డి కొరత తీవ్రంగా వేధిస్తోంది. దీంతో వరిగడ్డి కొనుగోలు చేయాలంటే ధర బెంబేలెత్తిస్తోంది. నియోజకవర్గంలో ప్రజలు వ్యవసాయంతో పాటు పశుపోషణపై కూడా దృష్టి సారిస్తారు. అయితే పాడిపశువులకు సరిపడినంత వరిగడ్డి లేకపోవడంతో ఏడాది పొడవునా పాడి పశువులకు వరిగడ్డి ఎలా అని పశుపోషకులు మదనపడుతున్నారు. తుపాను హెచ్చరికలు ఒకవైపు, కూలీల రేట్లు కూడా పెరగడంతో రైతులు వరికోత యంత్రాలను ఉపయోగించి కోతలు కోయించారు. యంత్రాల ద్వారా కోసినా గడ్డి పశువులకు గ్రాసంగా ఏ మాత్రం ఉపయోగపడదు. అంతేగాకుండా సగంపైన గడ్డి వృథాగా పోతోంది. దీంతో పశుగ్రాసం కొరత పొంచి ఉంది. ఈ పరిస్థితుల్లో పశువుల పోషణ భారంగా మారుతుందనే ఆందోళన పశుపోషకుల నుంచి వ్యక్తమవుతోంది. ఈ సమస్యను అధిగమించలేమనుకుంటున్న రైతులు పశువులను విక్రయించేందుకు సిద్ధం అవుతున్నారు.

భగ్గుమంటున్న వరిగడ్డి ధర

ఈ పరిస్థితుల్లో ఎక్కడైనా కొనుగోలు చేద్దామంటే వరిగడ్డి ధర భగ్గుమంటోంది. ట్రాక్టర్ ట్రక్కు వరిగడ్డి ధర రూ.13 వేలు పలుకుతుండటంతో అంత ధర పెట్టి కొనలేక పలువురు రైతులు మిన్నకుండిపోతున్నారు. గతేడాది ట్రాక్టర్ వరిగడ్డి ధర రూ.9 వేలు ఉండగా, ఈ ఏడాది రూ.13 వేలకు పెరగడం గమనార్హం. రైతులు అంత ధర పెట్టి వరిగడ్డి కొనుగోలు చేయడానికి ముందుకు రావడం లేదు. దీంతో పశుపోషణ ఎలాగనే ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది. వరిగడ్డి కొరత కారణంగా పాడిపశువులను అమ్ముకోవాల్సిన దుస్థితి పొంచి ఉందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం పశుపోషకులకు వరిగడ్డిని సరఫరా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రభుత్వం ఆదుకోకపోతే పశువులను అమ్ముకోవడం తప్ప వేరే మార్గం లేదనే అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతోంది.

యంత్రాల వలనే కొరత



ఎకరంలో వరిగడ్డి ట్రాక్టర్ ట్రక్కు అవుతుంది. అది రూ.13 వేలు అన్నా దొరకడం లేదు. నాకున్న 10 గేదెలకు మేత ఎలా తీసుకురావాలో తెలియడం లేదు. యంత్రాలతో వరికోతలు నిర్వహించడం వల్లనే వరిగడ్డి కొరత నెలకొంది.

– బాణావతు మస్త్రిబాబు, నూజివీడు

వరిగడ్డి ధర భగ్గుమంటోంది



నాకున్న పది గేదెల్లో ఐదు పాలు ఇస్తుండగా మిగిలినవి సూడివి. వరిగడ్డి కొనుక్కుందామంటే ధర భగ్గుమంటోంది. గతేడాది కంటే అదనంగా రూ.4 వేలు పైగా పెరిగింది. పశువులను ఎలా పోషించాలో అర్థం కావడం లేదు.

– గండికోట భవాని, నూజివీడు

అథ్లెటిక్స్ టెక్నికల్ అఫీషియల్‌గా పీడీ సత్యనారాయణ



తాడేపల్లిగూడెం (టీఓసీ) : డెహ్రాడూన్‌లో ఫిబ్రవరి 7వ తేదీ నుంచి 12వ తేదీ వరకు మినీ ఒలింపిక్స్‌గా చెబుతున్న 38వ జాతీయ క్రీడలు అథ్లెటిక్స్ పోటీలు జరగనున్నాయి. టెక్నికల్ అఫీషియల్ (సాంకేతిక అధికారి) (టీఓ)గా రాష్ట్రం నుంచి ముగ్గురు పీడీలను ఎంపిక చేశారు. శ్రీకాకుళం నుంచి హరిబాబు, గుంటూరు నుంచి జి.వెంకట్, పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంనకు చెందిన చింతకాయల సత్యనారాయణను ఎంపిక చేశారు. ఈమేరకు అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రటరీ ఏవీ రాఘవేంద్రరావు వివరాలతో కూడిన లేఖను పంపారు. ఈ సందర్భంగా చింతకాయల సత్యనారాయణను పలువురు అభినందించారు.

భక్తుల రద్దీపై అమావాస్య ఎఫెక్ట్


నిర్మానుష్యంగా ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రంలో భక్తుల రద్దీపై బుధవారం అమావాస్య ఎఫెక్ట్ పడింది. నిత్యం భక్తులతో రద్దీగా ఉండే ఆలయం, పరిసరాలు భక్తుల లేమితో నిర్మానుష్యంగా మారాయి. వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల ఇతర విభాగాలు భక్తుల లేక వెలవెలబోయాయి.

క్లుప్తంగా

రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం సేవలు అభినందనీయం



గరగ నృత్యాలు

తాడేపల్లిగూడెం (టీటీసీ): రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. సంఘ 152వ నెలవారీ సభా కార్యక్రమం స్థానిక గీతా మందిరంలో బుధవారం రాత్రి నిర్వహించారు. అధ్యక్షుడు సూరంపూడి వెంకట రమణ, ప్రధాన కార్యదర్శి చింతకాయల వంశీకృష్ణ, కోశాధికారి మాన బాబూరావులు పర్యవేక్షించారు. రాష్ట్ర నగర సంఘం ఉపాధ్యక్షుడు ఏపూరి సత్యనారాయణకు గౌరవ సత్కారం, పెనుమంట్ర మండలం పాలమూరుకు చెందిన గరగ నృత్య కళాకారుడు ఎస్.మల్లేశ్వరరావుకు కళా సత్కారం, ఆకుతీగపాడు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోలుకొండ శివకుమార్‌కు ఉత్తమ ఉద్యోగ సేవా పురస్కారం, పేద గరగ నృత్య కళాకారిణి ముగ్గు వెంకట రమణ ఆర్థిక సత్కారం చేశారు. విద్యాశాఖ విశ్రాంత ఉప సంచాలకులు డాక్టర్ జె.మాలతీ మాధవ్ రచించిన వారణాసి దర్శన నిర్దేశిక సూచిక గ్రంథాన్ని సభలో ఆవిష్కరించారు. తొలుత గరగ నృత్యాల ప్రదర్శన, సంగీత విభావరి జరిగాయి. పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

టిడ్కో భవనాల పరిశీలన



టిడ్కో భవన సముదాయాలను పరిశీలించిన కమిషనర్, అధికారులు

తాడేపల్లిగూడెం: ఎమ్మెల్యే బొలిశెట్టి ఆదేశాల మేరకు మునిసిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు అధికారులు ఎల్.అగ్రహారంలోని టిడ్కో భవన సుముదాయాలను పరిశీలించారు. డ్రెయిన్ అవుట్‌లెట్, సెప్టిక్ ట్యాంక్ ద్వారా నిలిచిపోయిన మురికి నీటిని తొలగించాల్సిందిగా సిబ్బందిని ఆదేశించారు. జంగిల్ క్లియరెన్సు చేయడానికి గడ్డి మందు స్ప్రే చేయాలని చెప్పారు. మునిసిపల్ ఇంజనీర్ వై.వెంకట రమణ, ఎంవీవీఎస్ఎస్ పవన్‌కుమార్, కె.సురేష్, మెప్మా బి.హెచ్. శ్రీనివాసు ఉన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

తణుకు అర్బన్: ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం గురువారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తణుకు డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్ తెలిపారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల ప్రయాణాలకు సంబంధించి తమ సూచనలు, సలహాలు, ఫిర్యాదులు తెలియజేయాలని కోరారు. తణుకు డిపో పరిసర ప్రాంత ప్రయాణికులు, విద్యార్థులు, వ్యాపారస్తులు, ఉద్యోగులు 99592 25484 నంబరుకు ఫోన్ చేసి ఆర్టీసీ మరింత మెరుగైన సేవలందించే విధంగా తోడ్పడాలని వివరించారు.

సత్తాచాటిన శశి విద్యార్థులు

తాడేపల్లిగూడెం: అస్సాం అగ్రికల్చరల్ యూని



జాతీయ సమైక్యతా కార్యక్రమంలో పాల్గొన్న శశి విద్యార్థులు

వర్సిటీ ఇటీవల నిర్వహించిన జాతీయ సమైక్యతా శిబిరానికి పట్టణంలోని శశి ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికై పాల్గొన్నారు. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు బుధవారం తెలియజేశారు. సంస్కృతి, సమైక్యత, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి అంశాలు విస్తృతంగా చర్చలు జరిగిన వాటిలో విద్యార్థులు భాగస్వాములయ్యారు. క్యాంపునకు ఎంపికైన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కె.అమరవాణి, ఎన్.హితేష్‌లను కళాశాల పాలకవర్గ వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, ప్రిన్సిపాల్ మొహమ్మద్ ఇస్మాయిల్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ షేక్ సల్మాన్ భాషాలు అభినందనలు తెలిపారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీటీసీ): లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మౌన అమావాస్య సందర్భంగా స్థానిక పడాల వృద్ధాశ్రమంలో లయన్స్ ఆర్ఆర్ రత్నకుమారి సౌజన్యంతో వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ జిల్లా కోఆర్డినేటర్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు, డైమండ్స్ సభ్యులు జొన్నల సతీష్ కుమార్, చెన్నారెడ్డి సతీష్, ఆకుల సతీష్, ఆంజనేయస్వామి, సాయిరాజు, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

నరసాపురం: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నరసాపురం 10వ అదనపు జిల్లా జడ్జి పి.విజయదుర్గ సూచించారు. మానవ అక్రమ రవాణా, బాల్య వివాహాలు అంశాలపై మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వైఎన్ బీఈడీ కళాశాలలో వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బుధవారం బహుమతులు అందజేశారు.

మహమ్మారి తగ్గుతోంది

- ఏఆర్‌టీ సెంటర్లో తగ్గుతున్న నమోదు
- క్షయ లక్షణాలు కనిపిస్తున్నాయి

తాడేపల్లిగూడెం: మానని రోగం, దీర్ఘకాలిక జబ్బు, మహమ్మారిగా ఆందోళనకు గురి చేసే ఎయిడ్స్ గత కొన్ని సంవత్సరాలుగా జిల్లాలో అధికారిక లెక్కలను చూస్తే క్రమంగా తగ్గుతోంది. ఏంటీ రిట్రోవల్ థెరపీ(ఏఆర్‌టీ) సేవలు ఏరియా ఆసుపత్రులలో అందుబాటులోకి రావడంతో దీంతో పాటు ఒంట్లో రోగాన్ని దాచుకోకుండా నిర్భయంగా రోగులు ఏఆర్‌టీ కేంద్రాలకు వచ్చి మందులు తీసుకోవడంతో రానురాను మహమ్మారి తగ్గుతోంది. జిల్లాలో భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రుల్లో ఏఆర్‌టీ కేంద్రాలు ఉన్నాయి. ఎయిడ్స్ లక్షణాలు కలిగిన రోగులు తమ వివరాలను ఆయా ఏఆర్‌టీ కేంద్రాల్లో రిజిస్టర్ చేయించుకుంటే చాలు, నెల వారీ మందులను ఉచితంగా సరఫరా చేస్తారు. కొందరికి ఎయిడ్స్‌తో పాటు క్షయ (టీబీ) లక్షణాలు కనిపిస్తాయి. అటువంటి వారికి కూడా ఈ కేంద్రాల్లో మందులను ఉచితంగా సరఫరా చేస్తు



తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలోని ఏఆర్‌టీ సెంటర్

న్నారు. ఏఆర్‌టీ కేంద్రాల్లో రోగులుగా రిజిస్టర్ నమోదు అయిన వారికి గతంలో ఉచితంగా ప్రయాణం చేసే వెసులుబాటు ఉండేది. రోగుల కోసం ఏఆర్‌టీ కేంద్రాల వరకు బస్సులు నడిపిన పరిస్థితులు ఉన్నాయి. ఈ సౌకర్యాన్ని తొలగించడంతో రోగులు సొంత ఖర్చులతో ఏఆర్‌టీ కేంద్రాలకు చేరుకుంటున్నారు. జిల్లాలోని మూడు ఏఆర్‌టీ కేంద్రాల్లో సుమారుగా 15 వేల మందికి మహమ్మారి ఆశించిన రోగులు చికిత్స పొందుతున్నారు. గత ఏడాది డిసెంబర్ 31వ తేదీ నాటికి తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలోని ఏఆర్‌టీ కేంద్రం నుంచి మందులు తీసుకుంటున్నవారు 5,528 మంది ఉన్నారు. దీర్ఘకాలికంగా మందులు వాడుతున్న రోగులు కాకుండా గడచిన ఐదు సంవత్సరాలుగా 1300కు పైగా మాత్రమే రిజిస్టర్ చేసుకున్నారు. ఈ అంకెలు తగ్గుతున్న ఎయిడ్స్‌కు సంకేతాలుగా ఉన్నాయి.

గడచిన ఐదు సంవత్సరాలలో ఇక్కడ జరిగిన రిజిస్ట్రేషన్‌లు చూస్తే...

2020-21	209
2021-22	293
2022-23	305
2023-24	246

2024-25(డిసెంబర్ 24వరకు)-185మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వీరు కాకుండా ఎయిడ్స్‌తో పాటు క్షయ లక్షణాలు కలిగిన 56 మంది రోగులు ఇక్కడ మందులు తీసుకొని వాడుతున్నారు.

హామీలను అమలు చేయాలి



ఇళ్ల స్థలాలు కోసం దరఖాస్తులు రాస్తున్న సీపీఐ నాయకులు, మహిళా సభ్యులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. భీమారావు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మామిడితోట 4, 6 వార్డుల్లో ఇళ్ల స్థలాలు అర్జీలు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.సీతారాం ప్రసాద్, పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి, సమాఖ్య అధ్యక్షురాలు వద్దాది మేరి, కార్యదర్శి ఎస్.నాగలక్ష్మి, నిమ్మకాయల కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ముందు జాగ్రత్తలతో వ్యాధుల నుంచి రక్షణ

తాడేపల్లిగూడెం రూరల్: పశువులు, జీవాల పెంపకంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీటీసీ గోవింద్ తెలిపారు. మండలంలోని పెదతాడేపల్లి గ్రామంలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 65 పశువులకు గర్భకోశ వ్యాధులకు టీకాలు వేశారు. సత్యనారాయణ, పశువైద్యాధికారి టి.విజయ్‌కుమార్, గోపాలమిత్రలు బుజ్జయ్య, గ్రామ పశుసంవర్ధక సహాయకులు చంద్రశేఖర్, శ్రీనివాస్, అనిల్, ప్రసాద్, గౌతమి, గంగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

142 పశువులకు వైద్య పరీక్షలు

మండలంలోని అప్పారావుపేట గ్రామంలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆరుగొల్లు శ్రీనివాసరావు మాట్లాడుతూ పాడి పశువులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని సూచించారు. అనంతరం 142 పాడి పశువులకు వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బీఆర్ఎస్‌వీ.సుబ్బారావు, నందమూరు మండల పశువైద్యాధికారి వి.సునీల్ కుమార్, పశువైద్య సిబ్బంది ఎల్ఎస్ఏ సత్యనారాయణ, పోసుబాబు, శ్రీను, మహేష్, ప్రకాష్, సునీల్, చిట్టియ్య తదితరులు పాల్గొన్నారు.

అత్తిలి మండలంలో...

అత్తిలి: పశుపెంపకంలో రైతాంగానికి అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చేందుకు పశుసంవర్ధక శాఖ నిరంతం అందుబాటులో ఉంటుందని ప్రాంతీయ పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కే. నరసింహారావు అన్నారు. అత్తిలి మండలం వరిఘేడులో గురువారం నిర్వహించిన ఉచిత పశు ఆరోగ్య శిబిరం, దూడల అందాల పోటీల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పశు సంపదపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎటువంటి చిన్నపాటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే వైద్యసేవలు అందజేయాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన దూడల అందాల పోటీల్లో అడ్డాల వెంకట రామారావు ఆవు దూడకు ప్రథమ బహుమతి, అడ్డాల వీర వెంకట రామకృష్ణ గేదె దూడకి ద్వితీయ బహుమతి, గోన వెంకట సత్యనారాయణ దూడకి మూడో బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆనాల ఆదినారాయణ, ఆళ్ల సత్యనారాయణ, దాసం ప్రసాద్, సుంకర నాగేశ్వరావు, పోతినిడి శ్రీనివాసరావు, బోడపాటి సూర్యచంద్రరావు, జంతు సంక్షేమ డైరెక్టర్ ఆళ్ల అజయ్ కుమార్, నల్లూరి సురేష్, గ్రామ సర్పంచి పంపన సత్యవతి, మండల అగ్రికల్చర్ ఆఫీసర్, డాక్టర్ శంకర్, సిబ్బంది, పశు సంవర్ధక సహాయకులు రైతులు, పశు పోషకులు పాల్గొన్నారు.



పెదతాడేపల్లిలో పాడి రైతులకు ప్రొటీన్ ప్యాకెట్లు అందజేస్తున్న దృశ్యం



తాడేపల్లిగూడెం మండలం అప్పారావుపేట గ్రామంలో పాడి పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం



వరిగేడులో అందాల పోటీల్లో గెలుపొందిన దూడలతో రైతులు

పది పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలి

తణుకు అర్బన్: విలువలతో కూడిన విద్య సమాజ హితానికి దోహదపడుతుందని, విద్యార్థులు ఆ దిశగా పయనించాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ స్టేట్ కన్వీనర్, విస్తరణ అభివృద్ధి కమిటీ డాక్టర్ కోడూరి రాధా పుష్పావతి అన్నారు. సంస్థ సభ్యుల సహకారంతో స్థానిక ఏకేటీపీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు 40 రోజులపాటు అందించే అల్పాహారం కార్యక్రమాన్ని గురువారం పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పది పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పదో తరగతి పరీక్షల కోసం అధిక సమయం పాఠశాలల్లో గడుపుతున్న నేపథ్యంలో వారికి ఈ అల్పాహారం కార్యక్రమాన్ని సభ్యుల సహకారంతో అందజేస్తున్నట్లు చెప్పారు. జిల్లా ప్రతిభా పురస్కారాల కమిటీ చైర్మన్ బోయపాటి రామలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు మంచి పోషకాహారం తీసుకుంటే చదువుపై దృష్టి కేంద్రీకరిస్తారనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు స్పష్టం చేశారు. అల్పాహారానికి ఆర్థికసాయం అందజేసిన కటారి శారదాదేవి, బోయపాటి రామలక్ష్మి, కోడూరి రాధా పుష్పవతి, కాజ వాణి, రామలక్ష్మి, డాక్టర్ బీటీఎస్ మాణిక్యాంబ, డాక్టర్ మలకపల్లి ఝాన్సీ, ఒబిలిశెట్టి మురళీ హరినాధ్, ఆలపాటి సుబ్బారావు, దాట్ల సత్యనారాయణరాజు, ఆక్కెళ్ల సుబ్రహ్మణ్యంలను పాఠశాల హెచ్ఎం టి.రామకృష్ణ అభినందించారు. జిల్లా శాంతి ర్యాలీ కమిటీ చైర్మన్ గమిని రాంబాబు, కార్యదర్శి బి రామకాశి, తణుకు డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ కటారి కాశీ విశ్వనాథరాజు, శివన్నారాయణ పాల్గొన్నారు.



తణుకు ఏకేటీపీ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న రాధాపుష్పవతి

రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చు

తణుకు అర్బన్: రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని తణుకు పట్టణ సీఐ ఎన్. కొండయ్య అన్నారు. 36వ జాతీయ రహదారి వారోత్సవాల్లో భాగంగా గురువారం ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్‌లు కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా నేటి యువత సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్నారని, మద్యం, మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడపడం వలనే అత్యధిక రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వివరించారు. 18 సంవత్సరాలు నిండని పిల్లలకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదని స్పష్టం చేశారు. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు రవాణా శాఖ, పోలీసు విభాగాలు నిత్యం కృషిచేస్తున్నాయని చెప్పారు. రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయాలై అధికశాతం ప్రాణ నష్టం జరుగుతున్నాయని ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ప్రయాణాలు చేస్తున్న వారికి రూ. 5వేలు జరిమానా విధిస్తున్నామని చెప్పారు. కళాశాల ప్రిన్సిపల్ యు.లక్ష్మీసుందరీబాయ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ట్రాఫిక్ ఎస్సై డి.ఆదినారాయణ, ఎస్సై బెన్నిరాజు, కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ చిట్టూరి సత్య ఉషారాణి, సీహెచ్ రమేష్‌బాబు, విద్యార్థినులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ కొండయ్య

అమ్మమ్మ పాడె మోసిన సినీ నటుడు రానా



తణుకులో అమ్మమ్మ భౌతికకాయన్ని మోస్తున్న రానా

తణుకు అర్బన్: మాజీ ఎమ్మెల్యే వైటీరాజా తల్లి, పారిశ్రామికవేత్త యలమర్తి నారాయణచౌదరి సతీమణి యలమర్తి రాజేశ్వరీదేవి అంత్యక్రియలు తణుకులో బుధవారం నిర్వహించారు. ప్రముఖ సినీ నటుడు దగ్గుపాటి రానాకు రాజేశ్వరీదేవి స్వయానా అమ్మమ్మ కావడంతో ఆయన అంత్యక్రియలకు హాజరై భౌతికకాయన్ని నివాళులర్పించి, కాడె మోశారు. రానాతోపాటు దగ్గుపాటి సురేష్ పాల్గొన్నారు.

హుండీ దొంగ అరెస్టు

అత్తిలి: అమ్మవారి ఆలయంలో హుండీ పగలు కొట్టి నగదును దోచుకెళ్లిన కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై పి ప్రేమరాజు తెలిపారు. ఈనెల 14వ తేదీ రాత్రి గుర్తు తెలియని వ్యక్తి అత్తిలి శ్రీవిజయచాముండేశ్వరి అమ్మవారి ఆలయం హుండీ తెరచి అందులో ఉన్న సుమారు రూ. 20 వేలు నగదును దోచుకెళ్లాడు. సంఘటనపై ఆలయ ధర్మకర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. పాలూరు గ్రామానికి చెందిన బండి శ్యాంబాబును బుధవారం కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

పురుగు మందులు పిచికారీ చేయొద్దు



తాడేపల్లిగూడెం రూరల్: మాధవరం గ్రామంలో వరి చేలను పరిశీలిస్తున్న ఏవో ప్రసాద్



పెంటపాడు: ఆకుతీగపాడులో రైతులకు సూచనలు అందజేస్తున్న వ్యవసాయాధికారులు

తాడేపల్లిగూడెం రూరల్: రైతాంగం ముందస్తుగా పురుగు మందులు పిచికారి చేయవద్దని మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ సూచించారు. బుధవారం మండలంలోని మాధవరం గ్రామంలో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో ప్రసాద్ మాట్లాడుతూ వరిపై సల్ఫేడ్ ఉధృతి కనిపిస్తుందన్నారు. వరి చేలకు నీరు పెట్టి ఎనిమిది గంటల తర్వాత తొలగించాలని, ఇలా మూడుసార్లు చేయాలన్నారు. చేనును ఆరబెట్టాలన్నారు. కాండం తొలిచే పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే ఎసిఫేట్ 1.5గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. ఆకు ముడత ఉంటే మోనోక్రోటోఫాస్ లేదా ఎసిఫేట్ పిచికారి చేయాలన్నారు. ఆయన వెంట ఆర్ఎస్‌కే ఇన్‌చార్జ్ వి.సురేష్, రైతులు పాల్గొన్నారు.

ఎరువుల అతి వినియోగంతో అనర్థాలు

పెంటపాడు: వ్యవసాయంలో అవసరం మేరకు మాత్రమే ఎరువులు పిచికారీ చేయాలని గూడెం ఏడీఏ పి. మురళీకృష్ణ సూచించారు. బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆకుతీగపాడు గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చేలు దుబ్బు చేసే సమయంలో వేయాల్సిన మోతాదు ఎరువులు, చీడపీడలు వ్యాపించకుండా పిచికారి చేయాల్సిన విధానాన్ని రైతులకు వివరించారు. రైతులు సందేహాలను నివృత్తి చేశారు. మండల వ్యవసాయాధికారి కె. పార్థసారధి మాట్లాడుతూ నాణ్యమైన ఎరువుల వాడకాన్ని రైతులు గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు ఝాన్సీ, భాగ్యలక్ష్మి, దివ్యలతో పాటు, గ్రామ రైతులు పాల్గొన్నారు.



అత్తిలి:ఉనికిలిలో రైతులకు సూచనలు ఇస్తున్న దృశ్యం

జింక్‌లోప నివారణకు చిలేటెడ్ జింక్‌ను పిచికారీ చేయాలి

అత్తిలి: మండలంలో ప్రస్తుతం వాతావరణ మార్పుల వల్ల వరిచేలల్లో జింక్‌లోపం కనబడుతోందని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు. బుధవారం అత్తిలి మండలం మంచిలి, ఉనికిలి, వరిఘేడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఏఓ రాజేష్ మాట్లాడుతూ జింక్‌లోప నివారణ కోసం చిలేటెడ్ జింక్ ఎకరాకు 200 గ్రాముల వంతున పిచికారీ చేయాలని సూచించారు. మండలంలో 14 వేల ఎకరాలకు గాను 11 వేల ఎకరాలలో ఈ క్రాపు నమోదు జరిగిందన్నారు. రైతు సేవా కేంద్రాల్లో మిగిలిన వారు వెంటనే నమోదు చేయించుకోవాలని ఏఓ రాజేష్ కోరారు.

నారాయణ సంస్థలను సీజ్ చేయాలి

తాడేపల్లిగూడెం (టీటీసీ): విద్యార్థి మరణానికి కారణమైన నారాయణ విద్యా సంస్థలను సీజ్ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎం.రూపశంకర్ డిమాండ్ చేశారు.విద్యార్థి మరణానికి మంత్రి నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక జూనియర్ కళాశాల వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రూపశంకర్ మాట్లాడుతూ అనంతపురం నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న చరణ్ అనే విద్యార్థి మరణానికి కారణమైన నారాయణ కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయలన్నారు. రాష్ట్రంలోని నారాయణ సంస్థలలో ఎంతో మంది విద్యార్థులు మృతి చెందినా ఏ జిల్లాలో కూడా సంస్థలపై కేసులు నమోదు కాలేదని, లక్షల రూపాయిల్లో ఫీజులు దోపిడీ చేస్తున్నప్పటికి, సంబందిత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి విద్యా సంస్థలను సీజ్ చేయాలన్నారు. పీడీఎఫ్‌యూ నాయకులు షరీఫ్, రోషన్, యశ్వంత్ పాల్గొన్నారు.

అందరి సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం



తాడేపల్లిగూడెం రూరల్: అవార్డులు అందుకున్న వారిని సన్మానించిన దృశ్యం



ఇరగవరం: సమావేశానికి హాజరైన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

తాడేపల్లిగూడెం రూరల్: సర్పంచ్‌లు, ఎమ్పీటీసీలు, పంచాయతీ కార్యదర్శుల సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో 2025-26 గ్రామాల సుస్థిర అభివృద్ధి ప్రణాళికపై సర్పంచ్‌లు, ఎమ్పీటీసీలు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విశ్వనాథ్ మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టాల్సిన పనులను గుర్తించి, వాటిని ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎంపీపీ శేషులత, జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఏఈలు రాజా శ్రీనివాస్, ముప్పిరిశెట్టి శ్రీనివాస్‌కుమార్, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, ఏపీఎం జీవీకేడీఎం. లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కాగా, ఇటీవల జాతీయ స్థాయి అవార్డు అందుకున్న పెదతాడేపల్లి సర్పంచ్ పోతుల అన్నవరం, ఉత్తమ అవార్డులు అందుకున్న ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి రవిచంద్రలను సన్మానించారు.



అత్తిలి: మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ ఇస్తున్న రిసోర్సు పర్సన్

గ్రామ అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలి

ఇరగవరం: గ్రామస్థాయిలో ప్రణాళికలు తయారుచేసి పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. బుధవారం సర్పంచులు, ఎంపీటీసీలకు శిక్షణ సమావేశం స్థానిక ఎంపీడీవో సమావేశ హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ సమగ్రంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యంగా ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

అత్తిలి: గ్రామాభివృద్ధిపై సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీవో పి శామ్యూల్ కోరారు. బుధవారం అత్తిలి మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి, వార్షిక ప్రణాళిక సిద్ధం చేయడంపై సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు శిక్షణ తరగతులను ఎంపీపీ సుంకర నాగేశ్వరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధితో పాటు పారిశుద్ధ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. గ్రామ పంచాయతీలు ఆదాయ వనరులను పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ విస్తరణ అధికారి ఎం శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఈపీఎఫ్‌లో నేటి నుంచి విజ్ఞాపన సమావేశాలు

పెంటపాడు: తణుకు ఇమ్మానియేలు ప్రేయర్ ఫెలోషిప్(ఈపీఎఫ్)లో ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 1 వరకు దేవుని విజ్ఞాపన సమావేశాలు నిర్వహించనున్నట్లు ఈపీఎఫ్ సంఘ అధ్యక్షుడు పరస మోజస్ ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ముగింపు రోజైన శనివారం రాత్రి 9 గంటలకు సంపూర్ణ రాత్రి ప్రార్థన జరుగుతుందన్నారు. సమావేశాలను విశ్వాసులు సద్వినియోగం చేసుకోవాలని ప్రవీణ్ కోరారు.